GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 204 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శనివారం : మార్చి 09-2024 | పేజీలు : 3

## పాఠశాలలపై సాయుధ మూకలు దాడి..

- 280 మందికి పైగా చిన్నారుల కిడ్నాప్



**టీ మీడియా, మార్చి 8, నైజీరియా :**
నైజీరియాలోని పాఠశాలలపై సాయుధ మూకలు దాడి చేసి, భారీ సంఖ్యలో విద్యార్థులను అపహరించుకెళ్లారు. ఏకంగా 280 మందికిపైగా చిన్నారులను కిడ్నాప్ చేసినట్లు అంచనా. కడునా రాష్ట్రంలోని చికున్ జిల్లాలోని పాఠశాలల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. నైజీరియాలో ఇటువంటి ఘటనలు సాధారణమే అయినప్పటికీ.. ఇంత భారీ సంఖ్యలో విద్యార్థులను కిడ్నాప్ చేయడం సంచలనం రేపుతోంది. కురిగా పాఠశాల ప్రాంగణంలోకి గురువారం ఉదయం ముష్కరుల గుంపు ప్రవేశించింది. గాల్లోకి కాల్పులు జరుపుతూ అందరినీ భయభ్రాంతులకు గురిచేసింది. పలువురు విద్యార్థులతో పాటు సిబ్బంది చాకచక్యంగా తప్పించుకున్నప్పటికీ.. ఓ టీచర్‌తోపాటు దాదాపు 187 మందిని అపహరించుకెళ్లారు. మరో ప్రైమరీ పాఠశాల నుంచి 125 మందిని కిడ్నాప్ చేయగా, వారిలో 25 మంది తప్పించుకున్నారు. ఇలా మొత్తంగా 280 మందికి పైగా చిన్నారులను ఎత్తుకెళ్లినట్లు అంచనా. దీనిని ధ్రువీకరించిన స్థానిక గవర్నర్.. విద్యార్థులంతా 8 నుంచి 15ఏళ్ల వయసులోపు వారేనని పేర్కొన్నారు. వారిని కాపాడేందుకు సాయుధ బలగాలు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడించారు.




## 36 మందితో కాంగ్రెస్ జాబితా

- తెలంగాణ నుంచి నలుగురికి చోటు

**టీ మీడియా, మార్చి 8, న్యూఢిల్లీ :**
లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేయబోయే ఎంపీ అభ్యర్థుల తొలి జాబితాను కాంగ్రెస్ ప్రకటించింది. అభ్యర్థుల ఎంపికపై తీవ్ర కసరత్తు చేసిన ఏఐసీసీ ఎట్టకేలకు శుక్రవారం క్యాండిడేట్ల ఫస్ట్ లిస్ట్‌ను రిలీజ్ చేసింది. దేశవ్యాప్తంగా 36 మందితో కాంగ్రెస్ తొలి జాబితాను విడుదల చేసింది. ఇందులో తెలంగాణ నుండి నాలుగు పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. జహీరాబాద్- సురేష్ షట్కర్, చేవెళ్ల %--% సునీత మహేందర్ రెడ్డి, నల్గొండ %--% కుందూరు రఘువీర్, మహబూబాబాద్ %--% బలరాం నాయక్ పేర్లను ఏఐసీసీ అనౌన్స్ చేసింది. మహబూబ్ నగర్ స్థానానికి స్వయంగా టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన వంశీచంద్ రెడ్డి పేరు ఈ జాబితాలో లేకపోవడం విశేషం.

### వాయనాడ్ నుంచే రాహుల్ గాంధీ..

మొత్తం 36 మందితో కూడిన జాబితాలో రాహుల్ గాంధీ, శశిథరూర్, గీతా శివరాజ్ కుమార్, డీకే సురేష్.. వంటి సీనియర్ల పేర్లు ఉన్నాయి. రాహుల్ గాంధీ మరోసారి కేరళలోని వాయనాడ్ నుంచే లోక్‌సభకు పోటీ పడనున్నారు. తెలంగాణతో పాటు ఛత్తీస్‌గఢ్- 6, కర్ణాటక- 6, కేరళ- 15, మేఘాలయా-2, నాగాలాండ్-1, సిక్కిం- 1, త్రిపుర- 1 స్థానానికి అభ్యర్థుల పేర్లను ప్రకటించింది కాంగ్రెస్. కర్ణాటకలోని శివమొగ్గ లోక్‌సభ స్థానానికి శాండల్‌వుడ్ స్టార్ హీరో భార్య గీతా శివరాజ్ కుమార్, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తమ్ముడు డీకే సురేష్ లు ఉన్నారు.

## దేశవ్యాప్తంగా శివార్చనలు, అభిషేకాలు

### భక్తులతో నిండిపోయిన ఆలయాలు

- మధ్యప్రదేశ్ సీఎం ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్లో పూజలు
- ఉత్సవాల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు
- రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి







**టీ మీడియా, మార్చి 8,హైదరాబాద్:**
దేశవ్యాప్తంగా మహా శివరాత్రిపర్వదినాన్ని దేశ ప్రజలు మహా వేడుకగా జరుపుకుంటున్నారు. దేశంలోని అన్ని శైవాలయాలు, జ్యోతిర్లింగాలు.. శివ భక్తులతో నిండిపోయాయి. తెల్లవారుజాము నుంచే ప్రధాన ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ ఉజ్జయినిలోని మహాకాలేశ్వర్ ఆలయంలో పూజలు చేశారు. ఆ ఆలయంలో తెల్లవారుజామున భస్మాహారతి నిర్వహించారు. ఆ తర్వాత మహాకాలుడిని సర్వాంగ సుందరంగా అలంకరించారు.కేంద్ర మంత్రి కిషణ్ రెడ్డి ఇవాళ తెల్లవారుజామున హనుమకొండలోని వెయ్యి స్తంభాల గుడిలో పూజలు నిర్వహించారు. గ్వాలియర్‌లో ఉన్న అచలేశ్వర్ ఆలయంలో కూడా భక్తులు పెద్దగా ఎత్తున దర్శనాలు చేసుకున్నారు. ఏపీలోని శ్రీశైలంలో కూడా భారీగా పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు లక్షల సంఖ్యలో హాజరయ్యారు. మక్తల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో అతి పురాతనమైన శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలోతెల్లవారిజం నుండి శ్రీ మల్లికార్జున స్వామి వారికి అభిషేకాలు కొనసాగుతున్నాయి. పట్టణంతో పాటు పరిసర గ్రామాలనుండి వేలాది మంది భక్తులు తరలివచ్చి శ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. పెద్ద ఎత్తున అభిషేకాలు చేయిస్తున్నారు. భక్తుల పెద్ద ఎత్తున తరలిరావడంతో దర్శనం కోసం గంట నుండి రెండు గంటల సమయం పడుతుంది .శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం తో పాటు మక్తల్ పట్టణంలోని శ్రీ అతి పురాతనమైన ఉమామహేశ్వరాలయం , శ్రీ కుంభేశ్వరాలయం, శ్రీ నగరేశ్వరాలయం ,శ్రీ ఆత్మలింగేశ్వరాలయం అదే విధంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం లోని శివాలయంలోనూ అభిషేకాలు విశేష పూజలు కొనసాగాయి. భక్తులు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టారు. స్వామివారికి అభిషేకాలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు.ఆలయాల వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు .ఎండల నుండి తట్టుకోవడానికి టెంట్లు , కూర్చునేందుకు కుర్చీలు వంటివి తో పాటు మంచినీటి వసతిని కల్పించారు. భక్తులు ఆ పరమశివుడిని ప్రశాంతంగా దర్శించుకున్నారు. అర్చకులు తిప్పయ్య స్వామి ,సిద్ధ రామయ్య స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు కొనసాగాయి.

### లక్ష్మీపురంలోని శ్రీ పార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం లో అభిషేకపూజలు నిర్వహించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు

### రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి

**హుస్నాబాద్ :** మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని హుస్నాబాద్ పట్టణంలోని సిద్దేశ్వర ఆలయం, మరకత లింగేశ్వర ఆలయాలను సందర్శించి, అనంతరం హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలో శ్రీ స్వయంభు రాజరాజేశ్వర స్వామిని శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకని పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శివుని దయవలన ప్రజలందరూ ఆనందంగా జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో దాదాపు 70 శివాలయాలు ఉన్నాయనీ, వాటి అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. రాబోయే కాలంలో మంచి వర్షాలు, రైతులు సుఖసంతోషాలతో పాడిపంటలతో , అభివృద్ధి చెందాలని ఈ ప్రాంతంలో ఉన్నటువంటి వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా కష్ట సుఖాల్లో ఇబ్బం దులు లేకుండా ఇక్కడి శాసనసభ్యుడిగా రాష్ట్ర మంత్రిగా నాకు బలాన్ని ఇవ్వాలని పొట్లపల్లి రాజరాజేశ్వర స్వామిని వేడుకున్నాట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేడం లింగమూర్తి, బంక చందు, చిత్తూరు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## పాతబస్తీ మెట్రోరైలు పనులకు శంకుస్థాపన

- రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్న సీఎం రేవంత్..


**టీ మీడియా, మార్చి 8, హైదరాబాద్:**
పాతబస్తీ మెట్రోరైలు ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. కులీ కుతుబ్ షాహీ నుంచి నిజాం వరకు నగర అభివృద్ధికి కృషి చేశారన్నారు. హైదరాబాద్ నగర ప్రతిష్టను నిలబెట్టడానికి కాంగ్రెస్ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకెళ్తోందన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు.. మిగతా సమయంలో అభివృద్ధిపైనే తన దృష్టి ఉంటుందని చెప్పారు. ఇది ఓల్డ్ సిటీ కాదు.. ఇది ఒరిజినల్ హైదరాబాద్ సిటీ అంటూ కితాబిచ్చారు. ఒరిజినల్ సిటీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు తాము కృషి చేస్తున్నట్లు వివరించారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఇందుకోసం ఇప్పటికే లండన్ థేమ్స్ నగరాన్ని అక్బరుద్దీన్ తో కలిసి సందర్శించామని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజల కోసం మెట్రో ఫేజ్-2 ను తీసుకొస్తున్నామన్నారు.ఒవైసీ హాస్పిటల్, చాంద్రాయణగుట్ట, మైలార్?దేవర్ పల్లి నుంచి ఎయిర్ పోర్టు వరకు మెట్రోరైలు ప్రాజెక్టు విస్తరణ చేయనున్నామని పేర్కొన్నారు. చాంద్రాయణగుట్టలో మెట్రో జంక్షన్?ను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. చంచల్ గూడ జైలును తరలించి విద్యార్థుల కోసం పాఠశాల, కళాశాలలు నిర్మిస్తామన్నారు. హైదరాబాద్ సిటీలోప్రతీ గల్లీని అభివృద్ధి చేసే బాధ్యత తమదని వివరించారు. మైనారిటీల కోసం 4శాతం రిజర్వేషన్ అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని గుర్తు చేశారు. రాష్ట్రంలో పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. చఇచ్చిన మాట ప్రకారం హైదరాబాద్ నగరాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని పేర్కొన్నారు. గండిపేట నుంచి నగరంలోని 55కి.మీల పరిధిలో మూసీ నదీ పరివాహక ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

## సీఎం హోదాలో తొలిసారిగా ఏపీకి రేవంత్

- కాంగ్రెస్ తరుపున ప్రచారం



**టీ మీడియా, మార్చి 8, హైదరాబాద్:**
తెలంగాణ ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి తొలిసారిగా విశాఖకు వెళ్లనున్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మార్చి 11న విశాఖ వేదికగా కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. టీడీపీ-బీజేపీ-జనసేన పొత్తులు ఖరారయ్యే అవకాశం ఉండటంతో ప్రైవేటీకరణ విషయంలో చంద్రబాబుపై రేవంత్ ఏం మాట్లాడతారనేదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.లోక్‌సభ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న తరుణంలో ఏపీ కాంగ్రెస్ తరపున తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం చేయనున్నారు. ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల, ఏఐసీసీ ఇంఛార్జ్ ఠాక్రే ఆహ్వానం మేరకు రేవంత్ ఏపీలో కాంగ్రెస్ తరపున ప్రచారం చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీ పెట్టబోతున్న 3 సభల్లో ఆయన పాల్గొంటారు. తొలి సభ ఈనెల 11న విశాఖలో జరగనుంది. ఈ నెల 11 న ఉదయం భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్నాక అక్కడి నుంచి గన్నవరం చేరుకుంటారు. అక్కడనుంచి విశాఖకు వెళ్తారని అధికార వర్గాలు తెలిపాయి. 11న జరిగే సభ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగేది కావడంతో అన్ని సంఘాలనూ కలుపుకుని సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకత్వం యత్నిస్తోంది.వాస్తవానికి కొంతకాలంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటైజేషన్ అంశం ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఈ అంశంపై ఏపీలోని ప్రధాన రాజకీయ పక్షాలన్నీ మెతక వైఖరి ప్రదర్శిస్తున్నాయనే విమర్శలు ఉద్యోగ సంఘాల నుంచి వినిపిస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే కచ్చితంగా ప్రైవేటీకరణ చేస్తారని రాజకీయ పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల వేళ కావడంతో కేంద్ర పెద్దలు సైలంట్‌గా ఉన్నారని ఆరోపిస్తున్నారు. దీంతో ఈ విషయంపై తమ వైఖరిని బలంగా చెప్పాలని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఏపీలో బీజేపీని దెబ్బకొట్టడమే కాకుండా.. తాము మద్దతు కూడగట్టుకోవడానికి ఇది అనువైన అంశమని ఏపీ కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోందిపదునైన మాటలతో విరుచుకుపడే రేవంత్ విశాఖ ప్రైవేటీకరణ అంశంపై కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం తీరును ఎండగట్టే అవకాశం ఉంది. ఆదిలాబాద్ టూర్‌లో రేవంత్ ప్రధాని మోదీని పెద్దన్న అని పిలిచినా విశాఖ సభలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై విమర్శలు గుప్పించే అవకాశం ఉంది. మరోవైపు టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తులు ఖరారయ్యే అవకాశం ఉండటంతో ప్రైవేటీకరణ అంశంలో చంద్రబాబుపై రేవంత్ ఏం మాట్లాడతారనేది ఆసక్తికరంగా మారింది. గతంలో టీడీపీలో అవకాశమిచ్చిన రాజకీయ గురువు చంద్రబాబుపై రేవంత్ ఏం మాట్లాడతారనే విషయంపై అంతా ఆసక్తిగా గమనిస్తున్నారు.



## మహాశివరాత్రి ఊరేగింపులో విషాదం..

### 14 మంది చిన్నారులకు గాయాలు

**టీ మీడియా, మార్చి 8,కోటా:**
మహాశివరాత్రి పర్వదినాన విషాదం నెలకొంది. రాజస్థాన్‌లోని కోటాలో మహాశివరాత్రి ఊరేగింపు వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. ఊరేగింపు వేడుకల్లో పాల్గొన్న 14 మంది చిన్నారులు విద్యుత్ షాక్ తగిలి గాయపడ్డారు. విద్యుత్ షాక్ గురైన చిన్నారుల్లో ఇద్దరి పరిస్థితి చాలా విషమంగా ఉందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హీరాలాల్ నగర్ తెలిపారు.అత్యవసర చికిత్స నిమిత్తం బాధితులను సమీపంలోని ఆస్పత్రిలో చేర్చినట్టు పోలీసులు తెలిపారు. విద్యుదాఘాతానికి గురైన కొంతమంది పిల్లలను వారి కుటుంబ సభ్యులు ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డుకు తరలిస్తున్న దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.ఈ విషాద ఘటనపై మంత్రి హీరాలాల్ మాట్లాడుతూ.. ఇది చాలా బాధాకరమైన సంఘటనగా పేర్కొన్నారు. విద్యుత్ షాక్ కారణంగా చాలా మంది చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారని, ఒకరికి వంద శాతం శరీరంపై కాలిన గాయాలు ఉన్నాయని తెలిపారు. చిన్నారులకు సాధ్యమైనంత వరకు అవసరమైన అన్ని చికిత్సలను అందించడానికి ప్రత్యేక బృందాన్ని కూడా ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు.పిల్లలకు చికిత్స అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా దర్యాప్తు చేయాల్సిందిగా అధికారులను మంత్రి నగర్ ఆదేశించారు. అయితే, విద్యుత్ షాక్‌కు హైటెన్షన్ ఓవర్ హెడ్ విద్యుత్ లైన్ కారణమని అనుమానిస్తున్నట్లు వార్తా సంస్థ పీటీఐ నివేదించింది. బాధితుల్లో ఇద్దరు పిల్లలు 50 శాతం, 100 శాతం కాలిన గాయాలు, మిగిలిన వారు 50 శాతం కన్నా తక్కువ కాలిన గాయాలు ఉన్నాయని పోలీసులు దర్యాప్తులో వెల్లడించారు.

## శేషవాహనంపై మహానందీశ్వరుడు

- భక్తులతో పోటెత్తిన మహానంది క్షేత్రం
- అంగ రంగ వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు





**టీ మీడియా, మార్చి 8, మహానంది:**
మహానంది పుణ్యక్షేత్రంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగ రంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేకువజాము నుండి భక్తులతో పోటెత్తింది. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు శుక్రవారం శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో విశేష పూజల చేత వేద పండితుల వేద మంత్రాల నడుమ స్వామి అమ్మవార్లకు వేదోక్తంగా విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లు నంది వాహన సేవతో ఆలయ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి అమ్మవారి దర్శనార్థమై వేలాది సంఖ్యలో భక్తులు క్షేత్రానికి రావడం జరిగింది. దర్శనార్థమై వచ్చిన వేలాది సంఖ్యలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి 10 గంటల నుండి క్షేత్రంలో లింగోద్భవ కాల మహాన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం వేద మంత్రాలతో విశేషంగా నిర్వహించారు. లింగోద్భకాలంలో సామాన్య భక్తులు కూడా దర్శనం చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక సేవా టికెట్లు ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా లింగోద్భావ కాల సమయంలో వేలాదిగా తరలి వచ్చే భక్తులు జాగరణ చేసి స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకుంటుంటారు. జాగరణ భక్తుల సౌకర్యార్థం కోసం రాష్ట్రస్థాయి చెక్కభజన పోటీలు, ఇతర విశేష సాంస్కృతిక కార్యక్రమాలు ఆలయ అధికారులు ఏర్పాటు చేయడం జరిగింది.అనంతరం శనివారం తెల్లవారుజామున రెండు గంటల నుండి లోక క్షేమ కోసం శ్రీ కామేశ్వరి దేవి, మహానందీశ్వరుల కళ్యాణము వైభవంగా ముక్కోటి దేవతలు ఆశీర్వాదంతో లక్షల సంఖ్యలో భక్తుల సమక్షంలో అత్యంత విశేషంగా జరుగును. క్షేత్రానికి వచ్చిన భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో మెడికల్ క్యాంపులు, నిత్యాన్నదాన ప్రసాద కౌంటర్లు, మజ్జిగ, త్రాగునీరు ఏర్పాట్లు దాతల సహాయంతో ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు.

## బాలికల వసతిగృహంలో భారీ అగ్నిప్రమాదం

- నాలుగేళ్ల చిన్నారి సజీవ దహనం



**టీ మీడియా, మార్చి 8, బీజాపూర్:**
ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలోని పొటాక్‌బిన్ బాలికల హాస్టల్‌లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో నాలుగేళ్ల చిన్నారి సజీవదహనమైంది. రాజీవ్‌గాంధీ ఎడ్యుకేషనల్ విజన్ జిల్లా కోఆర్డినేటర్ విజయేంద్ర వెల్లడించిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్‌లోని ఆవుపల్లి చింతకుంట గ్రామంలో బాలికల పోర్టా క్యాబిన్ (ప్రీఫ్యాబ్రికేటెడ్ పోర్టబుల్ స్ట్రక్చర్) రెసిడెన్షియల్ పాఠశాల వసతిగృహంలో దాదాపు 380 మంది బాలికలు ఉంటున్నారు. బుధవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా వసతి గృహంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో భయాందోళనలకు గురైన బాలికలు బయటకు పరుగులు తీశారు. వెంటనే పాఠశాల అధికారులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కాసేపటికి అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అయితే ఈ ప్రమాదంలో లిస్సా(4) అనే బాలిక మంటల్లో చిక్కుకొని సజీవ దహనమైంది.మృతురాలు లిస్సా పాఠశాల విద్యార్థిని కాదు. అదే హాస్టల్‌లో ఎనిమిదో తరగతి చదువుతోన్న తన అక్క ఇటీవల ఆమె తన స్వగ్రామం తిమ్మాపూర్ వెళ్లగా తనతో పాటు చెల్లెలు లిస్సాను తీసుకొచ్చింది. దీంతో గత కొన్ని రోజులుగా లిస్సా అక్కతో పాటే ఉంటోంది. ఆమెను తీసుకెళ్లడానికి ఇటీవల తల్లిదండ్రులు వచ్చినా, అక్కతో కొద్ది రోజులు ఉండి వస్తానని చెప్పింది. ఇంతలో ఈ దారుణం చోటు చేసుకుంది. అప్పుడే తమతోపాటు వచ్చి ఉంటే తమ బిడ్డ ప్రాణాలతో ఉండేదని ఆ తల్లిదండ్రులు రోదించిన తీరు ప్రతిఒక్కరినీ కలచివేసింది.


## ప్రారంభమైన జాతర బ్రహ్మోత్సవాలు




**టీ మీడియా, మార్చి 8, వనపర్తి బ్యూరో :**
ఆత్మకూరు మున్సిపాలిటీ లో ఉన్న శ్రీ చెర్ల పరమేశ్వర స్వామి జాతర బ్రహ్మోత్సవాలు ప్రారంభం. ఈ దేవాలయం దాదాపు క్రి.శ 15వ శతాబ్దం నుండి దీనికి చరిత్ర కలదు. ఇక్కడ వెలసిన లింగాన్ని నగరేశ్వరునిగా పూర్వం పిలుచుకునేవారు అన్ని లింగాల ఆకారంలో లాగా కాకుండా కోలాకారంలో ఒక బండ రాయిగా ఉంటుంది. దీనికి ఒక స్థల పురాణం ఉంది. పూర్వం ఒక రైతు పొలం దున్నడానికి ఒక రాయిని భూమి నుండి తీసి నాగలిపై బరువు కోసం ఉంచి పొలాన్ని దున్నిన తర్వాత ఆ రాయిని ఒకచోట ఉంచి వెళ్ళాడు కానీ మరుసటి రోజు వచ్చి చూసేసరికి ఆ రాయి పెట్టిన చోట కాకుండా తిరిగి వేరే చోటికి వెళ్లిందంట ఇట్టి విషయాన్ని రైతులతో పంచుకుంటే వారందరూ ఆ రాయిని లింగాకారంగా భావించి చిన్న గుడి కట్టి కొలిచేవారు అప్పటి సంస్థానాదీశుల పాలనలో గుడి పోషించబడింది చర్ల పరమేశ్వరుని మహిమలు చెప్పుకునే ఒక సంఘటన ప్రచారంలో ఉంది అదేమిటంటే వనపర్తి నుండి ఒక గాజుల వ్యాపారి ఆత్మకూరుకు వ్యాపారానికి వచ్చి తిరిగి వెళ్లేటప్పుడు భారీ వర్షాల కారణంగా వరదలు ముంచితాయంట వరద తాకిడికి దారి మూసుకుపోయింది. అప్పుడు ఆ గాజుల వ్యాపారి ఆ పరమేశ్వరుని ప్రార్థించాడంట "స్వామి". నేను వెళ్ళాలి కావున వరద నన్ను వెళ్లనివ్వకుండా నాకు దారి చూపించలేదు అని ప్రార్థించగానే వెంటనే వరదలో దారి ఏర్పడింది. ఆ గాజుల వ్యాపారి ఇంటికి సుఖంగా చేరుకున్నాడు. ఈ విధంగా చాలా కథలు ప్రచారంలో ఉన్నాయి అయితే ఈ జాతర చెర్ల పరమేశ్వరుడికి బ్రహ్మోత్సవం మూడు రోజులు సాగుతుంది ఇక్కడి "స్వారీ" అనగా దీనికి అర్థం సవారి అనే పేరుతో పిలుచుకుంటారు. పరమేశ్వరుడు పార్వతి గంగ సమేతుడై నందిపై సారీ చేసుకుంటూ జాతర మైదానంలో ఊరేగి భక్తులు ఈ బ్రహ్మోత్సవాన్ని చూడడానికి తండోపతండాలుగా తరలి వస్తారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవి కుమార్ యాదవ్ భక్తిశ్రద్ధలతో ఈ బ్రహ్మోత్సవాలను ఆటపాటలతో కోలాహలంగా జరుగుతాయని తెలిపారు. ఈ జాతర దాదాపు 20 రోజులు కొనసాగుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ తెలిపారు.

# ఉద్యోగాల పేరుతో టోకరా

- నకిలీ పోలీసుల మోసం
- రూ.3కోట్ల వసూళ్లు



**టీ మీడియా, మార్చి 8, విశాఖపట్నం :**
పోలీస్ శాఖలో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి రూ. 3కోట్లు వసూలు చేసిన జంటను విశాఖ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ యూనిఫాంతో ఫోటోలు, పోలీస్ అధికారిగా చలామణీ అవుతూ నిరుద్యోగుల్ని నిండా ముంచాడు. నిందితుడు ప్రియురాలితో కలిసి అమాయకుల నుంచి రూ. 3 కోట్లు వసూలు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. నిందితుల్ని హైదరాబాద్‌లో తలదాచుకున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విశాఖలో పోలీస్ యూనిఫాం అడ్డుపెట్టుకుని ఓ జంట నిరుద్యోగుల్ని నిండా ముంచింది. పోలీస్ శాఖలో ఉద్యోగులమని నిరుద్యోగుల్ని నమ్మించిన ఓ జంట దాదాపు 30మంది నుంచి రూ. 3కోట్ల రుపాయలు వసూలు చేశారు. పోలీస్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి లక్షలు వసూలు చేశారు. ఇలా పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు డబ్బులు చెల్లించినా ఉద్యోగాలు రాకపోవడంతో ఆరా తీయడంతో అసలు విషయం బయటపడింది.

ఘరానా మోసాలకు పాల్పడే పాత నేరస్తుడిగా గుర్తించారు. గతంలో కూడా ఇదే తరహా నేరాలకు పాల్పడిన నిందితుడు తాజాగా ప్రియురాలితో కలిసి పోలీస్ డ్రామాకు తెరతీసినట్టు గుర్తించారు. ఉద్యోగాల పేరుతో అమాయకుల్ని మోసం చేసిన ఘటనలో గతంలో అరెస్టైన నిందితుడు హనుమంతు రమేష్, అతని ప్రియురాలితో కలిసి తాజా మోసానికి పాల్పడినట్టు గుర్తించారు. మరికొంత మందితో కలిసి నిరుద్యోగుల నుంచి దాదాపు రూ. 3 కోట్లు వసూలు చేసినట్లు గుర్తించారు..

ఆర్థిక నేరాలు, మోసాలకు పాల్పడే హనుమంతు రమేష్‌పై విశాఖపట్నం అడవివరంలోని ఆర్ఆర్ టవర్స్‌లో ఉంటున్నాడు. ఇటీవల ఓ యువతితో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. పోలీసు శాఖలో ఉన్నత ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ యువకులకు ఆశ చూపించారు. వీరికి పలువురు మధ్యవర్తులు సహకరించారు. హనుమంతు అతని ప్రియురాలితో కలిసి పోలీస్ యూనిఫాంలలో బాధితుల్ని కలిసేవారు. మధ్యవర్తులు కూడా పోలీసులుగా భ్రమింప చేసే వారు. ఇలా ఒకరికి తెలియకుండా ఒకరి నుంచి దాదాపు 30 మంది నుంచి రూ. 3 కోట్ల వసూలు చేవారు. ఉద్యోగాలు రాకపోవడం, డబ్బులు తీసుకున్న తర్వాత పత్తా లేకుండా పోవడంతో బాధితులు పోలీసుల్ని ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. నిందితులు హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు కమిషనర్ సూచనలతో టాస్క్ ఫోర్స్ బృందాలు హైదరాబాద్ వెళ్లి హనుమంతు రమేష్‌తో పాటు అతడి ప్రియురాలిని అదుపులోకి తీసుకున్నాయి.

నిందితుల్ని విశాఖ పోలీసులు విచారిస్తున్నారు. నిందితుడు రమేష్ అక్కా చెల్లెళ్లైన ఇద్దరు యువతుల్ని పెళ్లి చేసుకుని మరో యువతితో కలిసి నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. నేరంలో కుటుంబ సభ్యుల ప్రమేయంపై విచారణ జరుపుతున్నారు. సులువుగా డబ్బు సంపాదించడానికి మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. గతంలో కూడా పలు నేరాలకు పాల్పడటంతో నిందితుడిపై కఠిన చర్యలకు పోలీసులు ఉపక్రమిస్తున్నారు.

# రాజ్యసభకు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుధా మూర్తి నామినేట్

**టీ మీడియా, మార్చి 8, ఢిల్లీ:**
ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుధా మూర్తి రాజ్యసభకు నామినేట్ అయ్యారు. రాష్ట్రపతి కోటాలో ఆమె పెద్ద సభలో అడుగు పెట్టబోతున్నారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదిక ట్విట్టర్ ద్వారా ఆమెకు అభినందనలు తెలిపారు. సామాజిక సేవ, దాతృత్వం, విద్యతో సహా విభిన్న రంగాలకు సుధా మూర్తి చేసిన కృషి అపారమైనదని ప్రధాని మోదీ కొనియాడారు. స్ఫూర్తిదాయకమైన ఆమె రాజ్యసభలో ఉండటం మన 'నారీ శక్తి'కి ఒక శక్తివంతమైన నిదర్శనమన్నారు. మన దేశం విధిని రూపొందించడంలో మహిళల శక్తి, సామర్థ్యాన్ని ఉదాహరణగా చూపుతుందన్నారు. ఆమెకు ఫలవంతమైన పార్లమెంటు పదవీకాలం కావాలని ఆకాంక్షించారు ప్రధాని మోదీ. సుధా మూర్తి 19 ఆగస్టు 1951న కర్ణాటకలోని షిగ్గావ్‌లో జన్మించారు. ఆమె కన్నడ మాట్లాడే దేశస్థ మాధవ బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారు. సుధా మూర్తి %దీఎదీ% కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నుండి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌పూర్తి చేశారు. తర్వాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుండి కంప్యూటర్ సైన్స్‌లో ఎం. ఇంగ్ డిగ్రీని పొందారు. తన చదువు పూర్తయిన తర్వాత, సుధా మూర్తి భారతదేశంలోని అతిపెద్ద ఆటో తయారీదారు టాటా ఇంజనీరింగ్, లోకోమోటివ్ కంపెనీలో పని చేయడం ప్రారంభించారు. ఆమె ఆ సమయంలో మొదటి మహిళా ఇంజనీర్ కావడం విశేషం. ఆ తర్వాత ఆమె పూణేలో డెవలప్‌మెంట్ ఇంజనీర్‌గా కంపెనీలో చేరారు



1996లో, సుధా మూర్తి ఇన్ఫోసిస్ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. ఈ రోజు వరకు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ట్రస్టీగా, బెంగుళూరు విశ్వవిద్యాలయంలోని %ూ+% సెంటర్‌లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఆమె క్రైస్ట్ యూనివర్శిటీలో కూడా బోధించారు. సుధా మూర్తి, నారాయణ మూర్తికి ఇద్దరు పిల్లలు, అక్షతా మూర్తి, రోహన్ మూర్తి. అక్షతా మూర్తి బ్రిటిష్ ప్రధాన మంత్రి, రిషి సునక్‌ను వివాహం చేసుకున్నారు. సుధా మూర్తి నవలలు, నాన్-ఫిక్షన్, ట్రావెలాగ్స్, టెక్నాలజీ ఆధారిత పుస్తకాలు, జ్ఞాపకాలు వంటి అనేక పుస్తకాలను రాశారు. ఆమె రాసిన అన్ని పుస్తకాలను ప్రధాన భారతీయ భాషలలోకి అనువదించారు. అంతకాదు ఇంగ్లీష్, కన్నడ వార్తాపత్రికలకు కాలమిస్ట్ కూడా పనిచేస్తున్నారు.




# పండగ పూట విషాదం

- రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకులు మృతి

**టీ మీడియా, మార్చి 8, ఆర్మూర్:**
వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్ జాతీయ రహదారిపై శుక్రవారం శివరాత్రి పండగ పూట జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకులు మృతి చెందారు. మోర్తాడ్ మండలంలోని దొనకల్ గ్రామానికి చెందిన మాడవీడి రవీందర్ (55 )గత కొన్ని సంవత్సరాల క్రితం గల్ఫ్ నుంచి వచ్చినారు. అనారోగ్యానికి గురికాగా డయాలసిస్ చేయించుకునేందుకు కొడుకు శివరాజ్ (24 )వెంట తీసుకొని టూ వీలర్ పై ఆర్మూర్ వైపు వస్తున్నారు. ఎదురుగా ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో సంఘటన స్థలంలోనే తండ్రి కొడుకులు ప్రాణాలు కోల్పోయారు. పండగ పూట ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది .పోలీసులు కేసు నమోదు చేసుకున దర్యాప్తు చేస్తున్నారు.

# ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య..

- కాలేజీ బిల్డింగ్‌పై నుంచి దూకి బలవన్మరణం!



**టీ మీడియా, మార్చి 8,హనుమకొండ:**
తెలంగాణ రాష్ట్రంలో మరో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుతోన్న ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కాలేజీ బిల్డింగ్ పై నుంచి దూకి సూసైడ్ చేసుకుంది. ఈ దారుణ ఘటన హనుమకొండలోని బీమారంలో గురువారం (మార్చి 7) చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే..హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామానికి చెందిన వలుగుల సాహితీ అనే విద్యార్థిని బీమారంలోని శివాని ఇంటర్మీడియట్ కాలేజీలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. అయితే ఏం జరిగిందో తెలియదుగానీ గురువారం రాత్రి కాలేజీ బిల్డింగ్‌పై నుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకుందని కాలేజీ నిర్వాహకులు చెబుతున్నారు. గురువారం రాత్రి ఘటన జరిగినా విద్యార్థిని తల్లిదండ్రులకు మాత్రం శుక్రవారం ఉదయం వరకు సమాచారం అందించకుండా గోప్యంగా ఉంచారు. నేరుగా పోస్ట్‌మార్టం తరలించాక మాత్రమే తమకు సమాచారం ఇచ్చారని సాహితీ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థిని మృతిపై యాజమాన్యం గోప్యత పాటించడంపై మృతురాలి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా సాహితీ చేతికి, తల భాగాలకు దెబ్బలు తగిలి ఉండడం వారి అనుమానాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. దీంతో విద్యార్థిని సాహితీ మృతిపై ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శివరాత్రి వేళ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య ఘటనతో కనపర్తి గ్రామంలో విషాదఛాయలు అల్లుకున్నాయి. మరోవైపు పరీక్షల భయంతో ఇంటర్ విద్యార్థిని సాహిత్య ఆత్మహత్య చేసుకున్నట్లు కాలేజీ యాజమన్యం చెబుతోంది. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు మీడియాకు తెలిపారు. కాగా బాచుపల్లి ఘటన మరువముందే తాజాగా మరో విద్యార్థిని కాలేజీ బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.



# రాజన్న ఆలయంలో హైకోర్టు జడ్జి పూజలు

**టీ మీడియా, మార్చి 8, రాజన్న సిరిసిల్ల :**
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని హైకోర్టు జడ్జి కె. సురేందర్ కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. న్యాయమూర్తి ఆలయానికి చేరుకోగానే ఈఓ కృష్ణ ప్రసాద్, ఏఈఓ హరికిషన్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. హైకోర్టు జడ్జితోపాటు రాజన్న సిరిసిల్ల జిల్లా జడ్జి ప్రేమలత, సబ్ జడ్జి రవీందర్, జూనియర్ సివిల్ జడ్జిలు ప్రవీణ్, జ్యోతిర్మయి, సుజన వారి కుటుంబ సభ్యులతో స్వామి వారిని దర్శించుకోగా, వారిని ఆశీర్వదించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే స్వామివారిని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జెడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ తదితరులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, వేములవాడ ఆర్డీఓ రాజేశ్వర్, డీఎస్పీ నాగేంద్రచారి, ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ఆప్

**టీ మీడియా, మార్చి 8,ఢిల్లీ :**




'సంసద్ మే భీ కేజ్రీవాల్, డిల్లీ హెూగీ ఔర్ ఖుష్ హాల్' అనే నినాదంతో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ఢిల్లీలో ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సిఎం భగవంత్ మాన్‌తో కలిసి పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ "నా కుటుంబంగా ఉన్న ఢిల్లీ ప్రజలకు సేవ చేసేందుకు నేను అన్ని ప్రయత్నాలు చేశాను. " ఆప్ పాలిస్తున్న ఢిల్లీ, పంజాబ్‌లలో మాత్రమే ఉచిత విద్యుత్ సరఫరా ఉంది" అని కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆప్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రతి ప్రాజెక్ట్‌ను నిలిపివేస్తుందని కేజ్రీవాల్ అన్నారు ఏడుగురు ప్రతిపక్ష అభ్యర్థులను పార్లమెంటుకు పంపడం ద్వారా తనను "బలపరచాలని" ప్రజలను కోరారు. ఢిల్లీలో ఎన్నుకుని అధికారంలోకి తెచ్చినందుకే ఆ వ్యక్తి మిమ్మల్ని ద్వేషిస్తున్నారని అన్నారు. మొహల్లా క్లినిక్‌లను బుల్‌డోజర్‌లతో కూల్చివేశారని, ఇంటింటికీ రేషన్ డెలివరీ పథకాన్ని, ఆసుపత్రుల్లో పరీక్షలు, మందులను నిలిపివేశారని ఆయన ఆరోపించారు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఏప్రిల్-మేలో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి.

## భక్తులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

**టీ మీడియా, మార్చి 8, మహానంది:**



మహానంది చిత్రానికి వచ్చే భక్తుల కోసం,ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసి భక్తులకు సేవచేయడం అభినందనీయమని నంద్యాల ఆర్డీవో మల్లికార్జున రెడ్డి అన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తులకు కొరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మండల గ్రామీణ వైద్యుల ఆధ్వర్యంలో గరుడనంది వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంను ఆర్డీవో మల్లికార్జున రెడ్డి విచ్చేసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భక్తులు ఈ ఉచిత మెడికల్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జలుబు, దగ్గు, జ్వరం, తలనొప్పి, గ్యాస్ట్రబుల్, నొప్పులకు తదితర వ్యాధులకు సంబంధించినవని ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆర్డీవో మల్లికార్జున రెడ్డి తాహసిల్దార్ రామచంద్రుడుతో కలిసి ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించి,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బందిని, మండల గ్రామీణ వైద్య సిబ్బంది చేస్తున్న సేవలకు అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ మండల అధ్యక్షుడు అమర్నాథ్, రెడ్ డ్రెస్ సొసైటీ గ్రామీణ వైద్యులు కమలాకర్ నాయుడు, మద్దిలేటి, లాల్ మదర్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ గురుకులాల సొసైటీ కార్యదర్శిగా బీ.సైదులు

**టీ మీడియా, మార్చి 8, హైదరాబాద్ :**




తెలంగాణ బీసీ గురుకులాల సొసైటీ కార్యదర్శిగా ఐఎఫ్ఎస్ అధికారి బీ సైదులును ప్రభుత్వం నియమించింది. 2005 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం చార్మినార్ సర్కిల్ సీసీఎఫ్‌గా పని చేస్తున్నారు. ఆయనను బీసీ గురుకులాల సొసైటీ కార్యదర్శిగా నియమిస్తూ సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. గురుకుల నియామక బోర్డులో సీనియర్ అధికారిగా ఆయనే ఉండటంతో బోర్డు చైర్మన్‌గానూ వ్యవహరించే అవకాశాలు ఉన్నాయి. బీసీ గురుకులాల సొసైటీ కార్యదర్శిగా, గురుకుల నియామక బోర్డు చైర్మన్‌గా ఉన్న మల్లయ్య భట్టును ప్రభుత్వం బదిలీ చేసింది.

## మహిళా దినోత్సం రోజు ధర్నా చేయాల్సి రావడం సిగ్గుచేటు

- ఎమ్మెల్సీ కవిత



**టీ మీడియా, మార్చి 8, హైదరాబాద్:**
అంతర్జాతీయ మహిళా దినోత్సం రోజు ధర్నా చేయాల్సి రావడం సిగ్గుచేటని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సంతోషంగా సంబురాలు చేసుకునే ఉమెన్స్ డే రోజున ఆడబిడ్డల ఉద్యోగాలకై ధర్నాలు చేసే దౌర్భాగ్యపు స్థితిని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. బాబా సాహెబ్ అంబేద్కర్ మహిళలకు అనేక హక్కులు కల్పించారని చెప్పారు. ప్రభుత్వ నియామకాల్లో మహిళలకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా హైదరాబాద్ ధర్నా చౌక్‌లో ఎమ్మెల్సీ కవిత దీక్షకు చేస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చిన తర్వాత 33 శాతం రిజర్వేన్‌ను పెంచుకున్నామన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు లక్షకుపైగా ఉద్యోగాలు కల్పించుకున్నామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల విషయంలో మాట తప్పిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డలకు అన్యాయం జరిగే ఏ ఒక్క కార్యక్రమం బీఆర్ఎస్ చేయలేదని వెల్లడించారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఆడపిల్లలకు వ్యతిరేకంగా జీవో 3 తెచ్చిందని విమర్శించారు. ఈ జీవో వల్ల ఉద్యోగాల్లో అమ్మాయిలకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే ఈ జీవోను రద్దుచేసి, హైకోర్టులు పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా వ్యతిరేక విధానాలతో ముందుకువెళ్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలకు వ్యతిరేకంగా ఏ నిర్ణయం తీసుకున్నా నిలదీస్తామని స్పష్టం చేశారు. జీవో 3 వల్ల గురుకులాల్లో మహిళలకు 12 శాతం ఉద్యోగాలే వచ్చాయన్నారు. తనకే అన్ని చట్టాలు తెలుసున్నట్టు సీఎం రేవంత్ వ్యవహరిస్తారని చెప్పారు. మహిళలకు 33 శాతం ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహం పెడుతున్నారని విమర్శించారు.

## త్వరలోనే మహిళలకు వడ్డీ లేని రుణాలు

- మంత్రి కోమటిరెడ్డి



**టీ మీడియా, మార్చి 8, నల్లగొండ :**
మహిళల ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా నల్గొండ పట్టణంలోని పానగల్‌లోని చారిత్రాత్మక పచ్చల ఛాయా సోమేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇక్కడ ఉన్న ఆలయాలకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఆలయాల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని చెప్పారు. మహిళా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. త్వరలోనే వారికి వడ్డీలోని రుణాలు ఇస్తామని స్పష్టం చేశారు.

## బీజేపీ హటావో, బేటీ బచావో : కాంగ్రెస్

**టీ మీడియా, మార్చి 8, న్యూఢిల్లీ:**



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మోదీ సర్కారుపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు మణిపూర్‌ను సందర్శించలేదని ప్రశ్నించింది. మహిళా రెజర్లపై బీజేపీ ఎంపీ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, ఆ అంశంపై ఎందుకు మౌనంగా ఉన్నారని కాంగ్రెస్ ప్రశ్నించింది. మహిళలకు నివాళి అర్పించడం తప్ప ప్రధాని మోదీ వారి కోసం ఏమీ చేయరు అని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. దేశంలోని మహిళలు ఆయన్ను కొన్ని ప్రశ్నలు వేస్తున్నారని, గత ఏడాది నుంచి మణిపూర్‌లో పౌర యుద్ధం నడుస్తోందని, బాధితుల్లో మహిళలు ఎక్కువగా ఉన్నారని, మహిళలపై దాడి జరిగిన ఘటనలకు చెందిన వీడియోలు రిలీజ్ అయ్యాయని, నగ్నంగా పరేడ్ చేయించారని, ప్రధాని మోదీ ఎందుకు ఆ రాష్ట్రాన్ని విజిట్ చేయడం లేదని జైరాం రమేశ్ ప్రశ్నించారు. బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఆయన మోదీ కుటుంబంలో సభ్యుడా అని నిలదీశారు. 2014లో అధికారంలోకి రాగానే బేటీ బచావో బేటీ పాడావో స్కీమ్‌ను ప్రభుత్వం ఆవిష్కరించిందని, కానీ మహిళ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయడం లేదని అన్నారు. బీజేపీ హటావో, బేటీ బచావో అని భారత్ మహిళలు డిమాండ్ చేస్తున్నారని రమేశ్ తెలిపారు.

## మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**టి మీడియా, మార్చి 8, పెద్దపల్లి :**



మహిళా దినోత్సవ వేడుకలు పెద్దపెల్లి జిల్లాలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం లాలపల్లి గ్రామంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు హాజరై మహిళలతో కలిసి కేక్ కట్ చేసి మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మహిళల సంక్షేమ%శీ% కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంద న్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధు లు పాల్గొన్నారు.

## నేను పార్టీ మారడం లేదు: మల్లారెడ్డి

**టీ మీడియా, మార్చి 8, హైదరాబాద్:**



బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను మాజీ మంత్రి మల్లారెడ్డి కలిశారు. కుమారుడు భద్రారెడ్డితో పాటు ఆయన వెళ్లారు. లోక్‌సభ ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని కేటీఆర్‌కు భద్రారెడ్డి తెలిపారు. మరోవైపు గురువారం సీఎం రేవంత్ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలవడంపై మల్లారెడ్డి వివరణ ఇచ్చారు. తన అల్లుడు రాజశేఖర్‌రెడ్డికి చెందిన కళాశాల భవనాల కూల్చివేత అంశంపై కలిసినట్లు తెలిపారు. తాను పార్టీ మారడం లేదని స్పష్టం చేశారు. గత నెలలో మల్లారెడ్డి మీడియాతో మాట్లాడుతూ మల్కాజిగిరి ఎంపీ స్థానానికి తన కుమారుడు భద్రారెడ్డి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.



## మేం చెప్పని పనులు కూడా చేశాం.. మీరు చెప్పింది చేయండి

- ఎమ్మెల్యే హరీశ్ రావు

**టీ మీడియా, మార్చి 8, సిద్దిపేట :**
పేదింటి ఆడపిల్లల పెళ్లికి ఆర్థిక భరోసా కల్యాణ లక్ష్మి పథకం, నాడు కేసీఆర్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ప్రవేశపెట్టి నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, 59జీవో పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గతంలో కేసీఆర్ ఎన్నికల హామిలో ఈ పథకాలు లేకున్నా మానవీయ కోణంలో స్పందించి ఈ పథకాలను అమలు చేసారన్నారు. కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం కల్యాణలక్ష్మి కింద లక్ష రూపాయలు, తులం బంగారం ఇస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తులం బంగారం వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మేం ఎన్నికల్లో చెప్పని పథకాన్ని అమలు చేసాం. మీరు ఎన్నికల్లో మాట ఇచ్చారు. మాట తప్పకుండా తులం బంగారం ఇవ్వాలన్నారు. అలాగే 59జీవో కింద పట్టా తీసుకోబోతున్న వారు మీ ఆస్తికి మీరు హక్కు దారులని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాడుతామన్నారు.

## ఆలయంలో మంత్రి కొండా సురేఖ పూజలు

**టీ మీడియా, మార్చి 8, వరంగల్ :**



ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన ఓరుగల్లు కోటలోని స్వయంభు శ్రీ శంభులింగేశ్వర స్వామి వారిని స్త్రీ, శిశు సంక్షేమ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం దర్శించుకున్నారు. స్వామి వారికి పూజలు చేశారు. అంతకు ముందు అర్చకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా, శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాకతీయుల కాలం నాటి వేయిస్తంభాల దేవాలయ కల్యాణ మండపాన్ని రాష్ట్ర మంత్రులతో కలిసి పునఃప్రారంభించారు. అనంతరం యాగశాలలో శాంతి హెూమం చేశారు.

## లింగవివక్ష లేని మహాజన సమాజ నిర్మాణమే మా లక్ష్యం

- ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు
- కొమ్ము చెన్నకేశవులు మహాజన్



**టీ మీడియా, మార్చి 8, వనపర్తి బ్యూరో :** దొడగుంటపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎమ్మార్పీఎస్) అధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మవై, ఆలివై, లాలివై, పోరాట జ్వాలవై, ఆశయాల బాటవై, ఈసృష్టికి మూలమై, మానవుడి మనుగడకు ప్రాణమై, అన్నిట్ల సగభాగమై, ఆదేరువై, ఆధరణై, అనునిత్యం అండగా ఉంటున్న ఆడబిడ్డలందరికీ "అంతర్జాతీయ మహిళా దినోత్సవ" శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం. మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని, ఆధిపత్యం, అణిచివేతలు, ఆకలి, అవమానాలు, హత్యలు, అత్యాచారాలు, అసమానతలు, సామాజిక, లింగ వివక్షత లేని నూతన సమాజ నిర్మాణం కావాలని, సమానత్వం, సమాన అవకాశాలు, సాధికారతను సాధించేలా మహిళలు ముందుకు నడవాలని ఆకాంక్షిస్తున్నాం.మహిళా చైతన్యం, హక్కుల కోసం పోరాడిన ధీరవనిత క్లారాకి, చదువు మూలమైన తల్లి సావిత్రి భాయి పూలేకి, త్యాగానికి రూపమైన మాతా రమాభాయికి, సేవకు నిలువెత్తు చిహ్నమైన విశ్వమాత మదర్ థెరిస్సాకి, పోరాటానికి సింబల్ ఐనా చాకలి ఐల్లవ్వకి, రుద్రమ్మకి, ఝల్కరి బాయి క్లోరికి, సామ్రాజ్యవాదంపై పోరాడిన మట్టిబిడ్డలు సమ్మక్క సారలమ్మకి, జాతి కోసం ప్రాణమిచ్చిన చైతన్యపు స్రవంతి భారతి మాదిగకు, ఇంకా ఎందరో, మరెందరో స్ఫూర్తికెరటాలైన వారందరికి సెల్యూట్ చేస్తున్నాం. ఈరంగం ఆ రంగమని కాదు, ఏ రంగమైన ఆఖరికి అంతరిక్షంలో కూడా వేగంగా దూసుకుపోతున్న వీరవనితలందరిని యాదిచేస్తూ మహిళల కష్టాలను, కన్నీళ్లను తుడిచిన ఉద్యమం, మహిళలపై జరుగుతున్న హత్యలు అత్యాచారాలపై పోరాటం చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టులను సాధించిన ఉద్యమం,మహిళల గొంతుకగా నిత్యం ధిక్కర స్వరం వినిపించిన ఉద్యమం మందకృష్ణన్న సారధ్యంలో నడిచే "దండోరా ఉద్యమమని" సగర్వంగా చాటుతూ ఆకాశంలో సగ భాగమైన మహిళలు అవకాశాల్లో, అన్నిట్లో ఉన్నతంగా ఎదగాలని కోరుతూ శ్రమలో పుట్టి, పెరుగుతున్న శ్రామిక నారీమనులందరికి ఎమ్మార్పీఎస్ పక్షాన మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొమ్ము శ్రీదేవి గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు, కొమ్ము చెన్నమ్మ మాజీ ఉప సర్పంచ్, కొమ్ము లావణ్య గ్రామ కార్యదర్శి, లావణ్య మాజీ గ్రామ అధ్యక్షురాలు, కొర్రపాటి అరుణ, కొమ్ము వసంత, కొర్రపాటి రాధిక, పి. అరుణ, మహిళా సభ్యురాలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలను చూసి కూడా ప్రోత్సహిస్తున్న అధికారులు

- ఫిర్యాదు ఇచ్చిన పట్టించుకోని కమిషనర్
- అధికారుల తీరు వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు




**టి మీడియా, మార్చి 8, పటాన్చెరు :** పటాన్చెరు నియోజకవర్గం లోని అమీన్పూర్ మున్సిపాలిలో అక్రమ నిర్మాణాలు జోరు అందుకున్నాయి చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని మున్సిపాలిటీ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. అమీన్పూర్ సర్వేనెంబర్ 576 పట్టా భూమి లో సుమారు 0.30 గుంటలో పుట్టగొడుగుల్లాగా అక్రమణాలు జరుగుతున్న పట్టించుకున్న నాధుడే లేడు. భూమి కోర్టు పరిధిలో కేసు ఉన్న భూమి లో అక్రమ నిర్మాత లు చేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన ఎటువంటి ఫలితం లేదు అని యజమాని వాపోయారు ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని స్థానిక స్థానిక నాయకులు డిమాండ్ చేశారు.

## యువశక్తి ఫౌండేషన్ మండల అధ్యక్షుడిగా రామకృష్ణ నియమకం




**టీ మీడియా, మార్చి 8, వనపర్తి బ్యూరో :** ఖిల్లాగణపురం మండల కేంద్రానికి చెందిన సిరిసాల రామకృష్ణ యువశక్తి ఫౌండేషన్ సేవల గురించి సోషల్ మీడియాలో రక్తదానం పేద పిల్లల విద్య కోసం అవగాహన కల్పిస్తూ తన శక్తి మేరకు చేస్తున్న కృషికి యువశక్తి ఫౌండేషన్ కి ఖిల్లాగణపురం మండల అధ్యక్షులుగా నియమించారు. రామకృష్ణ మాట్లాడుతూ యువశక్తి ఫౌండేషన్ చేస్తున్న సేవలు చాలా అభినందనీయం. ఆపదలో ఉన్న వేల మందికి స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అలాగే పేద విద్యార్థులకు చదువుకు అండగా ఉండడం, ఆకలితో ఉన్నవారికి యువశక్తి ఫౌండేషన్ ద్వారా పట్టెడు అన్నం పెట్టడం ఇలాంటి సేవలు నాకు బాగా నచ్చాయి. యువశక్తి ఫౌండేషన్కు నా వంతు కృషి చేస్తానని మంచి పుణ్య కార్యక్రమంలో పాల్గొనడం నా అదృష్టం అని తెలిపారు.

## శివాలయంలో పోటెత్తిన భక్తజనం



**టీ మీడియా, మార్చి 8, వనపర్తి బ్యూరో :** ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రంలో శుక్రవారం శివాలయంలో పోటెత్తిన భక్తజనం వేకువజాము నుండి శివునికి రుద్రాభిషేకం కుంకుమార్చన మంగళహారతులతో దర్శన ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి భక్తులకు ఈ ఏడాది చతుర్దశి ప్రారంభమవుతుంది. చతుర్దశి తిథి మార్చి 9న సాయంత్రం ఆరు 17 గంటలకు ముగుస్తుంది. శుక్రవారం లింగోద్భవ సమయానికి చతుర్దశి తిథి ఉండడంతో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా భక్తులు జరుపుకుంటున్నారు.

## బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



**టి మీడియా, మార్చి 8, పటాన్చెరువు :** పటాన్చెరువు నియోజకవర్గం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయాన్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించిన పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి దంపతులు. పరమశివుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను సన్మానించారు. హాజరైన మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు. పాల్గొన్నారు.

## మహాశివరాత్రి సందర్బంగా శివాలయాన్ని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు



**టీ మీడియా, మార్చి 8, సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా వైకుంతపురం లోని శివాలయాన్ని దర్శించుకుని అభిషేకం, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు నీలం మధు ముదిరాజ్ కు ఆశీర్వచనం అందజేశారు. మహాదేవుడు అందరిని సుఖ సంతోషాలతో చూడాలని దేవుని మొక్కుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి అందరి బ్రతుకుల్లో వెలుగుల్ని ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు ఆధ్యాత్మికంగా మహాశివరాత్రికి ఒక ప్రత్యేక స్థానం ఉందని నిరలాహారముండి జాగరణ చేసే భక్తులు ఎక్కువ మంది ఉంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అందరికీ మహా శివరాత్రి శుభాకాంక్షలు ఆయన తెలియజేశారు.

# జింకులో కావాలా.. బంకులో కావాలా..

- దుబాయ్‌లో ఉద్యోగాలంటూ ఎర



**టీ మీడియా, మార్చి 8, విజయనగరం :** అబుదాబిలో ఉద్యోగాలన్నారు. నెలకు లక్షల్లో జీతమని ఆశజూపి నిరుద్యోగ యువతకు వలేశారు. లక్షలు కాజేసి బోర్డు తిప్పేసి నిలువున ముంచారు. తాము కేటుగాళ్ల చేతిలో మోసపోయామని తెలుసుకున్న బాధితులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. విజయనగరం జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘరానా మోసం జిల్లాలో సంచలనంగా మారింది. విజయనగరం జిల్లా కేంద్రంలోని వైజాగ్ రోడ్?లో లైఫ్ లైన్ ట్రావెల్ ఏజెన్సీ పేరిట కార్యాలయాన్ని ప్రారంభించారు నిర్వాహకులు. నిరుద్యోగ యువతకు గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాలు ఇస్తామని ప్రకటనలు గుప్పించారు. ప్రధానంగా ఆంధ్రా ఒడిస్సా బోర్డర్?లోనే పలు అమాయక గిరిజన గ్రామాల యువతను టార్గెట్ చేశారు. ఆ గ్రామాల్లో ఉన్న వెల్డర్స్, ఎలక్ట్రిషియన్స్?తో పాటు ఇతర స్కిల్డ్ లేబర్?ను కలిసి విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించారు. నెలకు రెండు లక్షల జీతమని, ఐదేళ్లకు ఒకసారి జీతం రెట్టింపు అవుతుందని ఆశ జూపారు. వారి మాయమాటలు నమ్మిన సుమారు 123 మంది యువకులు విదేశాల్లో ఉద్యోగాలకు వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేశారు. తరువాత విదేశాలకు వెళ్లడానికి కొంత ప్రక్రియ ఉంటుందని అందుకోసం అడ్రస్ ప్రూఫ్?లతో పాటు ఒక్కొక్కరికి 65 వేలు ఖర్చువుతుందని, ఆ డబ్బు ఇస్తే ప్రక్రియ పూర్తి చేస్తామని నమ్మించారు నిర్వాహకులు.వారి మాటలు నమ్మిన యువకులు నిర్వాహకులు అడిగినట్లు అడ్రస్ ప్రూఫ్?లతో పాటు 65 వేల నగదు అందజేశారు. ఆ తరువాత ఈ నెల 5 న అందరూ విజయనగరంలోనే తమ కార్యాలయం వద్దకు లగేజ్?తో రావాలని, అలా వస్తే అక్కడినుండి విశాఖకు తీసుకెళ్లి అందరిని ఒకేసారి విమానంలో అబుదాబికి తీసుకెళ్తామని చెప్పారు. వారు చెప్పినట్లే ఐదవ తేదీన మొత్తం 123 మంది యువకులు విజయనగరం కార్యాలయానికి చేరుకున్నారు. తీరా వచ్చి చూసేసరికి ఏజెన్సీ బోర్డ్ తీసేసి కనిపించింది. కార్యాలయానికి తాళాలు కూడా వేసి ఉన్నాయి. నిర్వాహకులకు ఫోన్ చేస్తే ఫోన్స్ స్విచ్చాఫ్ చేసి ఉన్నాయి దీంతో కేటుగాళ్ల చేతిలో తాము మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు బాధితులు. అనంతరం జిల్లా ఎస్పీ దీపికను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని తెలియజేసి కన్నీటి పర్యంతమయ్యారు. నిర్వాహకులను పట్టుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఇటీవల ఉద్యోగాలు పేరిట నిరుద్యోగ యువతను పలువురు మోసగాళ్లు నమ్మించి మోసం చేస్తున్నారని, అలా ఎవరూ మోసపోవద్దని సూచించారు. ఉద్యోగాలు ఇస్తామని ఎవరైనా డబ్బులు కట్టమని చెప్తే అలాంటి వారిని తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

## మరోమారు రెచ్చిపోయిన ఉగ్రమూక

- నాలుగో కిడ్నాప్ కలకలం



**టీ మీడియా, మార్చి 8, ఇంఫాల్:** మణిపూర్‌లో మరో ఆర్మీ ఆఫీసర్ కిడ్నాప్ అయ్యారు. రాష్ట్రంలోని థౌబాల్ జిల్లా చరంగ్‌పట్ మమంగ్ లైకై ప్రాంతంలోని ఆర్మీ అధికారి ఇంటి నుంచి శుక్రవారం (మార్చి 8) ఉగ్రవాదులు అపహరించారు. తౌబల్ జిల్లాకు చెందిన కోన్సామ్ ఖేడాసింగ్ ఆర్మీలో జూనియర్ కమాండింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఖేధా సింగ్ సెలవులపై ఆయన స్వస్థలంలో ఉంటున్నారు. ఈ క్రమంలో ఆయన ఇంట్లోకి ప్రవేశించిన కొందరు గుర్తు తెలియని ముష్కరులు శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఆయనను బలవంతంగా వాహనంలో తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. దీంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. జాతీయ రహదారిపై చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి ముమ్మర తనిఖీలు చేపట్టాయి. ఆర్మీ ఆఫీసర్ ఖేధా సింగ్‌ను ఎందుకు కిడ్నాప్ చేశారో తమకు తెలియదని, ముష్కరులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నామని ఆర్మీ అధికారులు తెలిపారు. కిడ్నాప్ అయిన అధికారి కోసం భద్రతా దళాలు బృందాలుగా ఏర్పడి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. కాగా గతంలోనూ డబ్బు డిమాండ్ చేస్తూ అతనికి బెదిరింపు ఫోన్‌కాల్స్ వచ్చినట్లు కుటుంబసభ్యులు చెప్పారు. గత ఏడాది (2023) మేలో మణిపూర్ సరిహద్దు ప్రాంతంలో జాతి హింస ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు నలుగురు ఆర్మీ అధికారులను ఉగ్రమూక కిడ్నాప్ చేసింది. సెలవుల్లో ఉన్న అధికారులు, విధుల్లో ఉన్నవారి బంధువులు లక్ష్యంగా ఈ కిడ్నాపులు చేస్తున్నారు. సెప్టెంబర్ 2023లో అస్సాం రెజిమెంట్ మాజీ సైనికుడు సెర్టో తంగ్‌తంగ్ కోమ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి, దారుణంగా హతమార్చారు. ఆయన మణిపూర్‌లోని లీమాఖోంగ్‌లో డిఫెన్స్ సర్వీస్ కార్ప్స్ (%ణూజ%)లో విధులు నిర్వహిస్తున్నారు. సంఘటన జరిగిన సమయంలో ఆయన ఇంఫాల్ వెస్ట్‌లోని తన ఇంట్లో సెలవులో ఉన్నాడు. ఈ సంఘటన జరిగిన రెండు నెలల తర్వాత కొండ జిల్లా చురాచంద్‌పూర్ నుంచి లీమాఖోంగ్‌కు ఎస్‌యూవీలో ప్రయాణిస్తుండగా గుర్తుతెలియని ముష్కరులు నలుగురు వ్యక్తులను కిడ్నాప్ చేసి చంపేశారు. ఆ నలుగురు జమ్మూ కాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తోన్న భారత ఆర్మీ సైనికుడి కుటుంబ సభ్యులు.కిడ్నాప్ సమయంలో సైనికుడి తండ్రి గాయాలతో తప్పించుకోగలిగాడు. సమాచారం అందుకున్న సైన్యం విమానంలో అస్సాంలోని గౌహతిలోని బేస్ ఆసుపత్రికి తరలించారు. గత నెలలో ఫిబ్రవరి 27న పశ్చిమ ఇంఫాల్‌లో అదనపు ఎస్పీ అమిత్‌సింగ్‌ను అరంబై టెంగోల్ వర్గం వారు కిడ్నాప్ చేశారు. అయితే భద్రతా బలగాలు సకాలంలో స్పందించి ఆయనను కాపాడగలిగారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నా.. ఏదో ఒకచోట ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా లోయ ప్రాంతాల్లో సంఘ విద్రోహ శక్తులను కట్టడి చేయడం సవాలుగా మారిందని అధికారులు చెబుతున్నారు.

## శ్రీరాంసాగర్ ముగ్గురు యువకులు గల్లంతు..

**టి మీడియా, మార్చి 8,నిజామాబాద్ :** పండుగపూట నిజామాబాద్‌జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. శ్రీరాంసాగర్ జలాశయంలో పడి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. ఈ విషాదకర సంఘటన మెండోర మండలంలోని ఎస్సారెస్పీ లక్ష్మీ కాలువ హెడ్‌రెగ్యులేటర్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు అధికారులకు సమాచారమిచ్చారు. స్థానికులు, అధికారులు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన యువకులు సాయినాథ్, లోకేష్, మున్నాను జక్రాన్‌పల్లి మండలం గున్యా తండా వాసులుగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఉమ్మడి జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభించిన మున్సిపల్ వైస్ చైర్మన్



**టీ మీడియా, మార్చి 8, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా కేంద్రంలోని సిల్వర్ జూబ్లీ క్లబ్ లో శుక్రవారం నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. క్లబ్ అధ్యక్షులు సత్య శీలారెడ్డి, క్లబ్ సెక్రటరీ కృష్ణారెడ్డిలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 21 సంవత్సరాలుగా నారమ్మ నర్సిరెడ్డి శంకరమ్మల జ్ఞాపకార్థంగా ఈ షటిల్ బ్యాట్మెంటన్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సిల్వర్ జూబ్లీ క్లబ్ అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టింది అని క్రీడాలకు పెద్ద పీట వేసిందని అన్నారు. పోటీలో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులకు సిల్వర్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. క్రీడా పోటీల నిర్వహణను సుబ్బిరెడ్డి మోహన్ రెడ్డి నిర్వహిస్తున్నారని క్రీడాకారులకు ఎలాంటి అవసరం ఉన్న సంప్రదించగలరని సూచించారు.ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు నారమ్మ కృష్ణారెడ్డి రఘువర్ధన్ రెడ్డి కాంత రెడ్డి బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దామోదర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఆవుల రమేష్, కోశాధికారి బాదం పాండు, సభ్యులు జగదీశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మీకాంతరెడ్డి, తిమ్మారెడ్డి గుట్ట రవి, వరప్రసాద్, మన్మోహన్రావు తదితరులు ఉన్నారు.

## మహిళా దినోత్సవ సందర్భంగా ఘన సన్మానం



**టీ మీడియా, మార్చి 8, వనపర్తి బ్యూరో :** ఏ సమాజం, ఏ జాతి,ఏ సంస్కృతి స్త్రీకి సముచిత స్థానం ఇస్తుందో ఆ సమాజం, ఆజాతి ఆ సంస్కృతి అభివృద్ధి పథంలో వుంటుందని బి.అర్. యస్ రాష్ట్ర నాయకురాలు సింగిరెడ్డి.వాసంతి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా వాసంతి, నాగణమోని నాగమ్మ, నందిమల్ల.శారద, ఉంగ్లమ్మ్ అలేఖ్య తిరుమల్, మున్సిపల్ కార్మికురాలు, విశ్రాంత ఉపధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వాసంతి మాట్లాడుతూ స్త్రీలను అన్ని రంగాలలో ప్రోత్సహించిన దేశాలు అభివృద్ధి పథంలో ముందుకు కదిలాయని అన్నారు. ప్రభుత్వాలు మహిళలకు స్వయం ప్రతిపత్తినీ కల్పించి ఉపాధి అవకాశాలు ఇవ్వాలని అన్నారు. ఈ సందర్బంగా మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఎం.పద్మమ్మ, డి.బాగ్యమ్మ,విశ్రాంత ఉపాధ్యాయులు సింగమ్మ, భారతమ్మ ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బి.అర్.యస్ మహిళా నాయకురాలు ఎన్.నాగమ్మ, నందిమల్ల శారద, కౌన్సిలర్ ఉంగ్లమ్మ్ అలేఖ్య తిరుమల్, సాయిలీల,కవిత,జయశ్రీ, నాయకులు నందిమల్ల.అశోక్, గంధం.పరంజ్యోతి, సూర్యవంశం గిరి జోహెబ్, అణపటి.రాము,తోట.శ్రీను, సత్యం పాల్గొన్నారు.

## సీనియారిటీకే పట్టం కట్టిన అధిష్టానం



**టీ మీడియా, మార్చి 8, పినపాక :** పినపాక మణుగూరు కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే వారికి ఎప్పటికైనా సముచిత స్థానం లభిస్తుందని మరొకసారి రుజువైంది. గతంలో కేంద్ర మంత్రిగా చేసిన అనుభవం రెండవసారి ఎంపీగా రాజ్యసభ సభ్యులుగా ఎమ్మెల్యేగా పోటీ చేసిన అనుభవం పార్టీ కోసం పడ్డ కష్టాన్ని గుర్తించి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పోరిక బలం నాయక్ కి మహబూబాబాద్ ఎంపీ టికెట్ కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మణుగూరు మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు బానోతు లక్ష్మణ్, కురం రవి, ఆవుల సర్వేశ్వరరావు, ఐఎన్ టియూసి మాజీ ఉపాధ్యక్షులు వెలగపల్లి జాన్, మణుగూరు మండల యుత్ కాంగ్రెస్ అధ్యక్షులు కురం.వీరన్న, ఎం.కె. ఎం.రాజు, రామిరెడ్డి, సూరయ్య, జానపాటి వేణు,కుర్రి చలపతిరావు, మెరుగు.రవీంద్రనాథ్,వీరభద్రం, డొక్కా దేవకిరన్, రేసు ఉప్పలయ్య, ఓబిసి సెల్ జిల్లా కార్యదర్శి పెనుగొండ సాంబశివరావు, పగిళ్ల సతీష్ , దేగల కృష్ణ, తదితర నాయకులు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రసవవేదనను మించిన వేదన..

- మహిళా దినోత్సవం సందర్బంగా ప్రత్యేక ర్యాలీ



**టీ మీడియా, మార్చి 8, అనంతగిరి :** వాళ్ళంతా ఆదివాసి మహిళలు. కొండకోనల్లో వారి జీవనం. కనీస సౌకర్యాలు వారికి ఆమడ దూరం. ఆనారోగ్యల సమయంలో వారి జీవితం అగమ్య గోచరం. మహిళ గర్భిణీ అయితే.. ఆమె కష్టాలు అన్నీ ఇన్నీ కావు. బిడ్డ కడుపులో పడితే.. కాన్పు వరకు ప్రాణాలు ఉంటాయా.. గాల్లో కలుస్తాయా అన్న ఆందోళన. ఎందుకంటే.. ఆసుపత్రికి వెళ్లాలంటే వాహనాలు రావు. రోడ్లు సరిగా లేక.. వాహనాలు రాక ఇక డోలి కట్టాలసిందే. ఎన్నిసార్లు మోరపెట్టుకున్నా సమస్య తీరక పోవడంతో ఇక ఆ గిరిజన మహిళలు రోడ్డెక్కారు.అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కివర్ల పంచాయతీ జగడాలమాడి, తెంగిళ్ల బంధ సీమ రాయి గ్రామంలో 60 వరకు ఆదివాసి గిరిజనుల కుటుంబాలు నివసిస్తున్నన్నారు.



## భాగ్యనగర శిఖలో డబుల్ డెక్కర్ కారిడార్..

- కేంద్రం గ్రీన్ సిగ్నల్..


**టీ మీడియా, మార్చి 8, హైదరాబాద్:** జంట నగరాలతో పాటు ఉత్తర తెలంగాణలోని అయిదు జిల్లాల ప్రజలు, వాహనదారుల ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుంబిగించింది. జాతీయ రహదారి (ఎన్‌హెచ్)-44పై దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న వాహనదారుల కష్టాలకు చరమగీతం పాడేందుకు రూ. 1,580 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 5.320 కిలోమీటర్ల మేర కారిడార్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కండ్లకోయ జంక్షన్ సమీపంలో శనివారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ పై తర్వాత మెట్రో మార్గం నిర్మించనున్నారు. ఈ రకంగా నగరంలో తొలి డబుల్ డెక్కర్ కారిడార్‌కు నేడు నాంది ప్రస్థానం ప్రారంభం కానుంది. హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు మేడ్చల్-మల్కాజిగిరి, మెదక్, కామారెడ్డి, నిర్మల్-ఆదిలాబాద్ మీదుగా సాగే ఎన్‌హెచ్-44పైన జంట నగరాల్లో విపరీతమైన వాహన రద్దీతో నగర ప్రజలు, ప్రయాణికులు నిత్యం పలు అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో సికింద్రాబాద్‌లో రహదారి విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్‌కు కంటోన్మెంట్ ప్రాంతంలోని నిబంధనలు ఆటంకంగా మారాయి. సమస్య పరిష్కారానికి గత పాలకులు చిత్తశుద్ధి చూపకపోగా, వ్యక్తిగత అహం, రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా భావించడంతో రక్షణ శాఖ నుంచి అనుమతులు సాధించలేకపోయారు. 2019లో మల్కాజిగిరి ఎంపీగా ఎన్నికైన రేవంత్ రెడ్డి ఆ మరుక్షణం నుంచే ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించారు. సికింద్రాబాద్ ప్రాంతంలో రహదారుల విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణ శాఖ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో రక్షణ శాఖ స్టాండింగ్ సభ్యునిగా ఉన్న రేవంత్ రెడ్డి ఆ కమిటీ సమావేశాల్లోనూ కంటోన్మెంట్ ప్రాంతంలో రహదారుల విషయంలో ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై చర్చను కొనసాగించేవారు. ఇటీవల శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం.. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించడంతో ఈ అంశంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఏడాది జనవరి అయిదో తేదీన స్వయంగా కలిసి రాజధాని నగరంలో కంటోన్మెంట్ ప్రాంతంలో రహదారుల విస్తరణ రక్షణ శాఖ భూములు తమకు అప్పగించాలని, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తికి స్పందించిన రక్షణ శాఖ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి అంగీకరిస్తూ మార్చి ఒకటో తేదీన రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపింది. వెంటనే రంగంలోకి దిగిన రాష్ట్ర ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

**ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం ఇలా..**

ఎన్‌హెచ్-44పై సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ జంక్షన్ నుంచి మొదలై తాడ్‌బండ్ జంక్షన్, బోయినపల్లి జంక్షన్ మీదుగా డెయిరీ ఫాం రోడ్డు వద్ద ముగుస్తుంది. ఈ మొత్తం కారిడార్ పొడవు 5.320 కిలోమీటర్లు. ఇందులో ఎలివేటెడ్ కారిడార్ 4.650 కిలోమీటర్లు ఉంటుంది. అండర్ గ్రౌండ్ టన్నెల్ 0.600 కి.మీ ఉంటుంది. మొత్తం 131 పియర్స్ (స్తంభాలు) ఉంటాయి. మొత్తం ఆరు వరుసల్లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారు. ఎలివేటెడ్ కారిడార్‌పైకి రాకపోకలు సాగించేందుకు వీలుగా బోయినపల్లి జంక్షన్ సమీపంలో ఇరువైపులా (0.248 కి.మీ. వద్ద), (0.475 కిలోమీటర్ వద్ద) రెండు చోట్ల ర్యాంపులు నిర్మిస్తారు. ఇది పూర్తయిన తర్వాత ఈ ఎలివేటెడ్ కారిడార్‌పై మెట్రో మార్గం నిర్మించనున్నారు. ఫలితంగా ఆ మార్గంలో ప్రయాణం మరింత క్షేమంగా, వేగంగా, సుఖవంతంగా సాగనుంది.

## ఎడ్ల పందాలు బండలాగుడు పోటీలకు ఆహ్వానం

- పోటీలను ప్రారంభించనున్న మల్లు సూర్యవిక్రమాదిత్య



**టీ మీడియా, మార్చి 8, మధిర :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మధిరలో ఐదు రోజుల జాతరలో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు మధిర అయ్యప్ప స్వామి గుడి వెనుక ఎడ్ల పందాలు బండలాగుడు పోటీలు నిర్వహించబడును. ఈ పోటీలను సిఐ మధు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తనయుడు మల్లు సూర్య విక్రమాదిత్య ప్రారంభిస్తారు. కావున కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనగలరని మనవి. మధిర మండల పట్టణ కాంగ్రెస్ కమిటీ.